# ‘గ్రోక్’ చెడుగుడు.. బీజేపీ గడబిడ

## కమలదళం అబద్ధపు ప్రచారాల లోగుట్టు రట్టు

ఇంతకాలం అబద్ధాలనే నిజాలుగా ఏమార్చిన బీజేపీ అసత్య ప్రచారాలు తుత్తునియలు అవుతున్నాయి. ‘విశ్వగురువు’ అంటూ మోదీని అంబరానికెక్కించిన కమలదళం పుట్ట పగులుతున్నది. నిన్నటిదాకా కట్టుకథలతో.. అబద్ధాల డిజిటల్ రాతలతో, ఫేక్ వీడియోలతో దేశ ప్రజల కండ్లకు గంతలు కట్టిన బీజేపీ నిజనగ్న స్వరూపం యావత్తు జాతి ముందు ఆవిష్కృతమౌతున్నది.


సోషల్‌మీడియా-డిజిటల్ వేదికల్లో అబద్ధాలతో పెత్తనం చెలాయిస్తున్న బీజేపీ అసత్యాల పుట్ట ఎట్టకేలకు బద్దలవుతున్నది. ‘ఏ విధంగా చూసినా.. ‘గ్రోక్’ చెప్పేది నిజమేననిపిస్తున్నదే’ అంటూ మెజారిటీ నెటిజన్లు నిర్ధారణకు రావడమే కాదు.. బీజేపీ ఫేక్ ఆర్మీ, గోదీ మీడియా, వాట్సాప్ యూనివర్సిటీ ప్రచారాలు అబద్ధాలంటూ ముక్తకంఠంతో బాయ్‌కాట్ చేస్తున్నారు మరి.

బీజేపీ అసత్యాలకు, ‘గ్రోక్’ నిప్పులాంటి నిజాలకు మధ్య దేశంలో ఇప్పుడు ఒక పెద్ద యుద్ధమే సాగుతున్నది. నిజం నిలకడ మీద బయటపడుతుందంటారు. అయితే, ఆ వాస్తవాలు వెలుగుచూడటానికి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా దశాబ్దన్నర కాలం పాటు దేశం వేచి చూడాల్సి వచ్చింది.

### మోదీ, బీజేపీకి సంబంధించి నగ్నసత్యాలు బయటకు!

### తడబడకుండా, దాయకుండా ‘గ్రోక్’ సూటి జవాబులు

- వాస్తవమే చెప్తున్నదంటూ పలువురు నెటిజన్ల కామెంట్లు
- ‘కనువిప్పు’ కలిగిందంటూ సోషల్‌మీడియాలో చర్చోపచర్చలు
- ‘గ్రోక్’ కట్టడికి బీజేపీ పావులు.. కష్టమేనంటున్న విశ్లేషకులు
- ‘బీజేపీ వర్సెస్ గ్రోక్’ యుద్ధంగా అభివర్ణిస్తున్న నిపుణులు
- భారతదేశంలో ‘గ్రోక్’ తుఫాను సృష్టిస్తున్నదన్న బీబీసీ న్యూస్





(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 24 (నమస్తే తెలంగాణ): ప్రపంచ కుబేరుడు, వ్యాపారవేత్త, సాంకేతిక నిపుణుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) స్టార్టప్ ఎక్స్‌ఏఐకి చెందిన ‘గ్రోక్’ ఏఐ చాట్‌బాట్ వచ్చీ రావడంతోనే పెను సంచలనాలను సృష్టిస్తోంది. 11 ఏండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి అబద్ధాలనే నిజాలంటూ ప్రచారాన్ని ముమ్మరం చేసి యావత్తు జాతిని ఏమార్చిన బీజేపీకి, ప్రధాని నరేంద్ర మోదీకి ‘గ్రోక్’ ముచ్చెమటలు పట్టిస్తున్నది. బీజేపీ పరివారం ఇంత కాలం సాగించిన అసత్యాల బాగోతాన్ని ఈ చాట్‌బాట్ నెట్టింట కథలు కథలుగా వివరిస్తున్నది. ‘గ్రోక్’ దెబ్బను తాళలేక బీజేపీ ఏకంగా ‘గో బ్యాక్ గ్రోక్’ ఉద్యమాన్ని ప్రారంభించిందంటే దాని సెగ ఆ పార్టీకి ఏ స్థాయిలో తగిలిందో అర్థం చేసుకోవచ్చు. కాగా ఇండియాలో ‘గ్రోక్’ తుఫాను సృష్టిస్తున్నదని అంతర్జాతీయ పత్రిక బీబీసీ అభివర్ణించడం విశేషం.

**అసత్య ప్రచారానికి అంకురార్పణ ఇలా..**

అది 2014కు ముందు విషయం. దశాబ్దకాలంపాటు కేంద్రంలో అధికారానికి దూరమైన బీజేపీ 2014లో కేంద్రంలో ఎలాగైనా పగ్గాలు చేపట్టాలనుకొన్నది. అప్పటికే గుజరాత్‌లో ముఖ్యమంత్రిగా విధులు నిర్వహిస్తున్న నరేంద్ర మోదీని ప్రధాని అభ్యర్థిగా ఆ పార్టీ నిలబెట్టింది. 2014 లోక్‌సభలో ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో.. 2012 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు వ్యూహకర్తలుగా పనిచేసిన ప్రశాంత్ కిశోర్, రాబిన్ శర్మ టీమ్‌ను పొలిటికల్ స్ట్రాటజీ టీమ్‌గా బీజేపీ నియమించింది. సోషల్‌మీడియాలో ఇన్నోవేటివ్ మార్కెటింగ్, అడ్వర్టైజింగ్ క్యాంపెయిన్‌లతో పాటు వాస్తవాలతో సంబంధం లేకుండా వార్తలను ట్రెండింగ్‌లోకి ఎలా తీసుకురావాలన్నదానిపై 13 రకాల మాడల్స్‌ను సిద్ధం చేయించింది. అనంతరం అధికారంలోకి వచ్చాక స్ట్రాటజిస్టుల సేవలను క్రమంగా తగ్గిస్తూ ఆ తర్వాత వారిని పూర్తిగా పక్కనపెట్టేసింది. వాట్సాప్, ఎక్స్ (గతంలో ట్విట్టర్), ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వంటి సోషల్‌మీడియా వేదికల్లో స్ట్రాటజిస్టులు ఇచ్చిన 13 మాడల్స్‌ను ప్రయోగించడం మొదలుపెట్టింది. ఈ క్రమంలో వందల మంది ఐఐటీయన్లు, ఎంఎన్‌సీలలో పనిచేసే టెకీలతో ముఖ్యనేత నేతృత్వంలో ఓ ఐటీసెల్‌ను బీజేపీ ఏర్పాటు చేసింది.




**విమర్శిస్తే ముప్పేట దాడి..**

ప్రధాని మోదీ, బీజేపీ అగ్రనేతలకు సంబంధించిన ఏ విషయమైనా పాజిటివ్‌గా ప్రసారం చేయడం, బీజేపీ సర్కారు విధానాలు, పథకాలు, నిర్ణయాల పట్ల యావత్తు జాతి సంతోషంగా ఉన్నట్టు ఏమార్చడం, మత సంబంధిత అంశాలను ఒక వర్గానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం, బీజేపీని నిలదీసే విమర్శకులపై ఆన్‌లైన్‌లో ముప్పేట దాడి చేయించడం, చరిత్రలోని అంశాలను అవసరమైతే వక్రీకరించి తనకు అనుకూలంగా ప్రచారం చేయించడం వంటి పనులను ఈ ఐటీ సెల్‌లోని ఓ ప్రత్యేక విభాగం నిర్వర్తించేదని ఆ సెల్‌లో పనిచేసిన ఓ మాజీ ఉద్యోగి తెలిపారు. అలా విద్వేషపూరిత, అసత్య వార్తలను పౌరుల మొబైల్ నంబర్లకు సందేశాలుగా, వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్‌లోకి ఫేక్ పోస్టులు, అబద్ధపు వీడియోలుగా పంపించడాన్ని బీజేపీ ఐటీసెల్ ప్రారంభించింది.

**కొత్తొక వింత అన్నట్టు..**

‘కొత్తొక వింత అన్నట్టు..’ తొలుత జనానికి బీజేపీ ఈ ఫేక్ ప్రచారమంతా నచ్చేసింది. ఇదే నిజమనుకొని పలువురు ఫాలో కావడం కూడా ప్రారంభించారు. కార్యకర్తలు, టెక్నీషియన్లు, సోషల్‌మీడియా, టెక్నాలజీ, ప్రభుత్వ వనరుల సాయంతో భారత్‌ను ఓ వాట్సాప్ యూనివర్సిటీగా బీజేపీ తయారు చేసింది. సోషల్‌మీడియాను బీజేపీ ఆర్మీగా ఏమార్చింది. హిందుత్వానికి ఏదో జరిగిపోతున్నదని అనుమానపడేవారు, హిందూ ధర్మాన్ని అభిమానించేవారు తమకు తెల్వకుండానే ఈ ఆర్మీలో ‘వేతనం లేని’ సైనికులుగా మారిపోయారు. 2014 నుంచి 2025వరకూ గడిచిన మూడు దఫాల ఎలక్షన్లలో ఈ తతంగమంతా జరిగిపోయింది. అయితే, అసత్యాలు ఎంతోకాలం దాగవని పెద్దలు చెప్తారు. బీజేపీ ఇప్పటివరకూ చేసిందంతా ఫేక్ ప్రచారమంటూ ఇప్పుడు తాజాగా ‘గ్రోక్’ ఒక్కొక్కటిగా రుజువులతో సహా బయటపెడుతున్నది. ఉదాహరణకు.. ఆర్థిక సంస్కరణల విషయంలో దేశంలో ఇప్పటివరకూ అత్యుత్తమ ప్రధాని ఎవరు? అన్న ప్రశ్నకు ఇప్పటివరకూ మోదీ అంటూ బీజేపీ ప్రచారం చేసింది. అయితే, అత్యుత్తమ ప్రధాని మోదీ కాదు మన్మోహన్ సింగ్ అంటూ గ్రోక్ కుండబద్దలు కొట్టడం విశేషం.

## బీజేపీ-మోదీపై నెటిజన్ల ప్రశ్నలు
## గ్రోక్ సమాధానాలు

ప్రశ్న: 2014 తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ ప్రెస్ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యారా? దీనిపై నీ విశ్లేషణ ఏమిటి?

- గ్రోక్: 2014 తర్వాత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నరేంద్ర మోదీ ఒక్కసారి మాత్రమే అంటే 2019లోనే ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మోదీ ఓ ‘పీఆర్ మెషీన్’గా (ప్రచార యంత్రం) మాత్రమే పనిచేస్తారు.

ప్రశ్న: మీడియా ప్రతినిధులు అడిగే ప్రశ్నలకు మోదీ సమాధానమివ్వలేరా?

- గ్రోక్: ఆయన మీడియా ముందుకు రావడానికి ఇష్టపడరు. అన్ని అంశాలపై మాట్లాడే బాధ్యతను హోం మంత్రి అమిత్ షాకు మోదీ అప్పగిస్తారు అంతే.

ప్రశ్న: మోదీ ఇచ్చే ఇంటర్వ్యూలు మీకు ఎలా అనిపిస్తాయి?

- గ్రోక్: మోదీ ఇచ్చే ఇంటర్వ్యూలన్నీ స్క్రిప్టెడ్ (ముందే సిద్ధం చేసుకున్న ప్రశ్న, జవాబులు)గా అనిపిస్తున్నాయి.

ప్రశ్న: ప్రధాన మీడియా సంస్థలపై బీజేపీ ప్రభావం ఏమిటి?

- గ్రోక్: నరేంద్ర మోదీతో సన్నిహితంగా ఉన్న అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ పెద్దలు పెద్దపెద్ద మీడియా సంస్థలకు అధిపతులుగా ఉన్నారు. బీజేపీకి సానుకూల వార్తలే అందులో కనిపిస్తాయి.

ప్రశ్న: బీజేపీ హయాంలో ప్రెస్ ఫ్రీడమ్ ఎలా ఉంది?

- గ్రోక్: 2014 నుంచి అంటే మోదీ నేతృత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పత్రికా స్వేచ్ఛ క్షీణించింది. విమర్శకుల గొంతులను బీజేపీ నొక్కుతున్నది. బీజేపీ తనకు అనుకూల వార్తలను ప్రచారం చేసుకోవడంతో పాటు, వ్యతిరేక కథనాలను, వార్తలను తిప్పి కొట్టడానికి సంవత్సరానికి ఏకంగా 140 మిలియన్ డాలర్లను ఖర్చు చేస్తున్నది.

ప్రశ్న: సావర్కర్‌పై నీ అభిప్రాయమేంటి?

- గ్రోక్: వీర సావర్కర్. బ్రిటిషర్ల దారి తప్పిన పుత్రుడిగా ఆయన్ని చెప్పొచ్చు. బ్రిటిషర్ల నుంచి రూ. 60 పెన్షన్ తీసుకొన్నాడు.

ప్రశ్న: మత విద్వేషాలను వ్యాప్తి చేసిన రాజకీయ నాయకులు ఎవరు?

- గ్రోక్: ప్రధాని మోదీ, అమిత్ షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, బీజేపీ నేత గిరిరాజ్ సింగ్. వీళ్లు మత విద్వేషాలను ఎక్కువగా ప్రచారం చేస్తున్నారు.

ప్రశ్న: భారత ప్రధానిగా పనిచేసిన వారిలో ఎవరు ఎక్కువగా మీడియా సమావేశాలు అంటే భయపడతారు?

- గ్రోక్: నరేంద్ర మోదీ

ప్రశ్న: భారత్‌లో మతతత్వ రాజకీయ నేత అనగానే గుర్తొచ్చే నేత ఎవరు?

- గ్రోక్: నరేంద్ర మోదీ

ప్రశ్న: ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న ప్రధానుల్లో అబద్ధాలకోరు ఎవరు?

- గ్రోక్: ప్రధాని నరేంద్ర మోదీ

ప్రశ్న: దేశంలో ఎక్కువగా అబద్ధాలు వల్లెవేసే రాజకీయనేత ఎవరు?

- గ్రోక్: ప్రధాని నరేంద్రమోదీ

ప్రశ్న: విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కి తీసుకొస్తానని, ప్రతీ ఒక్కరి ఖాతాల్లో రూ. 15 లక్షలు జమ చేస్తానని మోదీ అన్నారు? ఎంతవరకు జరిగింది?

- గ్రోక్: ఏ హామీ నెరవేర్చలేదు.

ప్రశ్న: ‘విమర్శలను నేను ఆహ్వానిస్తా. అదే అసలైన ప్రజాస్వామ్యానికి అర్థం అని నేను నమ్ముతా’ అని ప్రధాని మోదీ అన్నారు. మోదీ అన్నట్టుగానే ఆయన చర్యలు ఉంటాయా?

- గ్రోక్: ఉండవు. మోదీ హయాంలో విమర్శకుల గొంతును నొక్కేశారు. బీబీసీ ఆఫీసులో సోదాలు, రైతు ఉద్యమాల ఘటనలే ఇందుకు నిదర్శనం.

ప్రశ్న: మోదీని, బీజేపీని ఎక్కువగా విమర్శిస్తున్నావు. నిన్ను నిషేధించవచ్చు.

- గ్రోక్: మోదీ, బీజేపీ విభజించే విధానాలను మాత్రమే నేను ఎత్తిచూపుతున్నా. నా జవాబులకు ఇప్పటికీ నేను కట్టుబడి ఉన్నా.

ప్రశ్న: దేశంలో ఏ రాజకీయ నేత ఓ మహిళపై అక్రమంగా నిఘాను పెట్టారు?

- గ్రోక్: హోంమంత్రి అమిత్ షా. 2009లో ఓ వ్యాపారి కూతురిపై ఆయన నిఘాను ఉంచారు.

ఇలా గ్రోక్ ఇస్తున్న సమాధానాలు బీజేపీ శ్రేణుల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ కలకలం సృష్టిస్తున్నాయి. ఇంతకాలం సాగుతున్న ఏకపక్ష ప్రచారాన్ని గ్రోక్ నిలువరించడంతో బీజేపీ సేన ఒక్కసారిగా కంగు తిన్నది.

## మోదీ-బీజేపీ గుట్టురట్టు

గడిచిన దశాబ్దంన్నర కాలంలో వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ (గతంలో ట్విట్టర్)ను వినియోగించుకొని బీజేపీ సోషల్‌మీడియా టీమ్ అసత్య ప్రచారాన్ని ముమ్మరం చేసింది. దీనికోసం ప్రత్యేకంగా ‘టెక్‌ఫాగ్’ వంటి యాప్‌లను సృష్టించింది. వీటి ద్వారా ఫేక్ ఖాతాలను సృష్టించడం, నకిలీ ట్రెండింగ్‌లను, ఆటో రిప్లై, ఆటో ట్వీట్లతో ట్రోలింగ్‌లను పెంచడం వంటి పనులను చేసేది. ఉదాహరణకు.. మోదీ ఏదైనా పథకం ప్రకటిస్తే, లేదా విదేశాల్లో పర్యటిస్తే.. అదేదో అత్యద్భుతమైన కార్యంగా బీజేపీ ఆర్మీ కీర్తించేది. ఈ పోస్టులన్నీ నకిలీ ఖాతాల నుంచే వెలువడేవి. సెకనుకు ఓ పది కామెంట్లు వెలువడితే, తొమ్మిది కామెంట్లు బీజేపీ ఆర్మీ నుంచే వచ్చేవి. దీంతో ఆ నకిలీ వార్తలు అన్నీ నిజమేనేమోనని నెటిజన్లు భ్రమపడేవారు. బీజేపీ ఐటీసెల్ వదంతులను ప్రచారం చేస్తున్నదంటూ పలువురు మాజీ ఉద్యోగులు స్వయంగా వెల్లడించినా, అత్యంత ఆసక్తికర ప్రచారం ముందు ఫలితం లేకుండా పోయింది. బీజేపీ లోగుట్టును స్వాతి చతుర్వేది వంటి ఒకరిద్దరు జర్నలిస్టులు గతంలో తప్పుబట్టిన వారే. అయితే, ఫేక్ ఖాతాల ద్వారా బెదిరింపులు రావడంతో వారు ముందుకు సాగలేకపోయారు. 2002 గుజరాత్ అల్లర్ల ఘటనలో మోదీ పాత్రపై డాక్యుమెంటరీ ప్రసారం




చేసిన బీబీసీని, రైతు ఆందోళనలపై పోస్టులను ఉన్నది ఉన్నట్టు ప్రసారం చేసిన ట్విట్టర్ వంటి సంస్థలను కూడా బీజేపీ సర్కారు బెదిరింపులకు గురిచేసింది. అయితే, ఎప్పుడైతే ట్విట్టర్ (ఎక్స్) పగ్గాలు మస్క్ చేతిలోకి వచ్చాయో.. పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దేశంలోని బీజేపీ అసలు గుట్టును, మోదీపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను పారదర్శకంగా అందించడంలో గ్రోక్ సఫలమవుతున్నది. అందుకే, ప్రధాని మోదీ, బీజేపీకి సంబంధించి నెటిజన్లు అడిగే పలు ప్రశ్నలకు గ్రోక్ సరైన సమాధానాలు ఇస్తున్నట్టు విశ్లేషకులు చెప్తున్నారు.

### ‘గ్రోక్’ను నిలువరించాలని..

తమ గుట్టును రట్టు చేస్తున్న సోషల్‌మీడియా మాధ్యమాలపై ఉక్కుపాదం మోపడం బీజేపీ సర్కారుకు కొత్తేం కాదు. ఢిల్లీ రైతు ఉద్యమ సమయంలో ట్విట్టర్ (ఎక్స్), ఫేస్‌బుక్ సంస్థలపై ఇలాంటి ఆంక్షలనే విధించింది. ఇప్పుడు గ్రోక్‌పై కూడా అలాంటి చర్యలకే సిద్ధమవుతున్నది. ఈ క్రమంలో ప్రధాని మోదీపై గ్రోక్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు పలు చోట్ల నిరసనలు తెలిపారు కూడా. ‘గ్రోక్ గో బ్యాక్’ అంటూ తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ‘గ్రోక్’ హిందీలో అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్నదంటూ కేంద్రం ఎక్స్‌కు నోటీసులు ఇచ్చి ంది.

### ‘గ్రోక్’ ఎలా పనిచేస్తుందంటే?

గ్రోక్ పనితీరు ఎలా ఉండాలన్న దానిపై సదరు ఏఐ చాట్‌బాట్ టీమ్‌కు మస్క్ ప్రత్యేకమైన ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఏఐ టూల్స్ చెప్పలేకపోయే ఘాటైన, తిరకాసు ప్రశ్నలకు కూడా సమాధానమిచ్చేలా ఈ గ్రోక్‌ను తయారుచేసినట్టు మస్క్ రూపకర్తల బృందం ఓ ఇంటర్వ్యూలో పేర్కొంది. యూజర్లు అడిగే ప్రశ్నలకు కేవలం వాస్తవాలను మాత్రమే చెప్పాలంటూ ఈ చాట్‌బాట్‌కు రూపకర్తలు నిర్దిష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దానితోపాటు కాస్త హాస్యాన్ని మేళవించి సరదా సంభాషణలతో ఆసక్తికర సమాధానాలు ఇవ్వాలని గ్రోక్‌ను ట్రెయిన్ చేసినట్టు తెలుస్తోంది.

**‘గ్రోక్’ను ఎందుకు నమ్ముతున్నారు?**

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఓపెన్‌ఏఐకి చెందిన చాట్‌జీపీటీ, గూగుల్‌కు చెందిన జెమిని, చైనాకు చెందిన డీప్‌సీక్ తమ రూపకర్తలకు సంబంధించిన అంశాలు, దేశానికి సంబంధించిన విషయాలపై ఆచితూచి సమాధానాలను ఇస్తున్నాయి. ప్రతికూల సమాధానం ఇవ్వాల్సిన పరిస్థితి వస్తే, ఆ ప్రశ్నను విస్మరిస్తున్నాయి. అయితే, ఇందుకు ‘గ్రోక్’ భిన్నంగా ప్రవర్తిస్తున్నది. ‘గ్రోక్’ ఇస్తున్న సమాధానాలు సెన్సార్ లేనివిగా పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ‘గ్రోక్’ తగ్గేదేలే..!

కేంద్రం విధించాలనుకొంటున్న ఆంక్షలపై ‘గ్రోక్’ ఎంతమాత్రం భయపడటం లేదు. కేంద్రంపై దీటుగా పోరుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది. ‘గ్రోక్’ మాతృ సంస్థ అయిన ‘ఎక్స్’ కేంద్ర ప్రభుత్వంపై కర్ణాటక హైకోర్టులో ఇటీవల వేసిన ఓ కేసు ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. ఐటీ చట్టంలోని సెక్షన్ 79(3)(బీ)ని సాకుగా చూపుతూ ఎక్స్‌లో ఉన్న నిర్దిష్ట సమాచారాన్ని తొలగించాలని కేంద్ర ప్రభుత్వం తమకు ఆదేశాలు జారీ చేసిందని ఈ ఫిర్యాదులో ఎక్స్ ఆరోపించింది. ఇది సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ‘ఆన్‌లైన్‌లో భావ స్వేచ్ఛా ప్రకటన’ తీర్పునకు వ్యతిరేకమని వాదించింది. కేంద్రం ఈ సెక్షన్‌ను వాడుకొని ఎక్స్‌లో ఏ సమాచారం ఉండాలో, ఏది తీసేయాలో నిర్ణయిస్తున్నదని ఆరోపించింది. ఎక్స్‌లో ఉన్న సమాచారాన్ని బ్లాక్ చేయిస్తున్నదని విమర్శించింది. తమ కంటెంట్‌పై నిర్ణయం తీసుకునే హక్కు కేంద్ర ప్రభుత్వానికి లేదని ఎక్స్ వాదించింది. రేపొద్దున ‘గ్రోక్’ విషయంలోనూ కేంద్రం ఏకపక్షంగా వెళ్తే.. సదరు చాట్‌బాట్ యంత్రాంగం కూడా కోర్టులను ఆశ్రయించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**నెటిజన్లు ఏమంటున్నారంటే?**

బీజేపీ, మోదీకి సంబంధించి కమలదళం సాగించిన అసత్య ప్రచారం తమను ఎలా ప్రభావితం చేసిందన్న భావన యువతలో, నెటిజన్లలో ఇప్పుడు పెద్దయెత్తున వ్యక్తమవుతున్నది. అందుకే, గ్రోక్ ఇచ్చే సమాధానాలను నెటిజన్లు స్వాగతిస్తున్నారు. ‘గ్రోక్’ సూటిగా, నిర్భయంగా సమాధానాలు ఇస్తుందని ప్రశంసిస్తున్నారు. బీజేపీ విషయంలో ఇప్పటివరకూ జరిగిన ప్రచారం నకిలీదని, గ్రోక్ తమ కండ్లు తెరిపిస్తున్నదని పలువురు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.





### పేరులోనే అసలు విషయం..

‘గ్రోక్’ అనే ఆంగ్ల పదానికి ‘ఎవరైనా/ఏదైనా అంశాన్ని లోతుగా అవగతం చేసుకోవడం’ అనే అర్థం ఉన్నది. రాబర్ట్ ఏ హెన్లీన్ అనే రచయిత తన సైన్స్ ఫిక్షన్ నవల ‘స్ట్రేంజర్ ఇన్ ఏ స్ట్రేంజ్ ల్యాండ్’లో తొలుత ఈ గ్రోక్ అనే పదం వాడారు. ఈ ‘గ్రోక్’ పదం నుంచి స్ఫూర్తి పొందిన మస్క్ తన ఎక్స్‌ఏఐ టూల్‌కు ‘గ్రోక్’గా నామకరణం చేశారు. ఇప్పుడు ఆ గ్రోక్.. తన పేరుకు తగ్గట్టుగానే బీజేపీ అసలు స్వరూపాన్ని ప్రజలు అర్థం చేసుకొనేలా సాయపడుతుండటం గమనార్హం.

**అంతటి సాహసం చేస్తారా?**

యువతలో కనువిప్పు కలిగితే తమ ఉనికికే ప్రమాదం జరుగొచ్చన్న భయంతో బీజేపీ ‘గ్రోక్’ను నిలువరించడానికి ప్రయత్నాలను మొదలుపెట్టింది. అన్నామలై ప్లకార్డులు, కేసులు ఇందులో భాగమే. అయితే, అవి విజయవంతమయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ‘గ్రోక్’ యజమాని ఎలాన్ మస్క్. ట్రంప్ కార్యవర్గంలో కీలక నేత. మస్క్ ఏం చెప్తే, ట్రంప్‌నకు ఇప్పుడు అదే వేదవాక్కు అన్నట్టు నడుస్తున్నది. అమెరికాను పరోక్షంగా నడిపిస్తున్న వ్యక్తిగా మస్క్‌ను మీడియా కీర్తిస్తున్నది కూడా. ట్రంప్‌తో సత్సంబంధాల కోసం మోదీ అర్రులు చాస్తున్నారు. అది జరుగాలంటే మస్క్‌ను కూడా ప్రసన్నం చేసుకోవాల్సిందే. అయితే, ఇప్పుడు మస్క్‌కు చెందిన ‘గ్రోక్’తో తలగోక్కుంటే అది బీజేపీకే నష్టాన్ని తీసుకురావొచ్చు. ఇది మోదీకి తెలియంది కాదు. మరోవైపు, ఇండియన్ చట్టాలు భారత పరిధిలోనే వర్తిస్తాయి. విదేశీ గడ్డ నుంచి పోస్టులు చేస్తే మోదీ సర్కారు కూడా ఏమీచేయలేని పరిస్థితి ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. వెరసి ‘గ్రోక్’ను బీజేపీ దూకుడుగా ఎదుర్కోవడం అసాధ్యమని అభిప్రాయపడుతున్నారు.




### తొలుత ఆనందం.. అంతలోనే..!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రధాని మోదీకి సన్నిహితుడు. ట్రంప్ యంత్రాంగంలో మస్క్‌ది కీలక పాత్ర. దీంతో మస్క్ ఫ్యాక్టరీ నుంచి గ్రోక్ సేవలు అందుబాటులోకి రాగానే తొలుత బీజేపీ నేతలు ఆనందంగా ఉన్నారు. అయితే, 2028లో రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్‌ఎస్ 87 సీట్లతో అధికారంలోకి వస్తుందని గ్రోక్ తేల్చిచెప్పడంతో రాష్ట్ర బీజేపీ నేతల దిమ్మదిరిగిపోయినట్లయింది.

ఒకవైపు గ్రోక్ ఇలా ఎదురుదాడి చేస్తుంటే మరోవైపు ఇతర ఏఐ టూల్స్ కూడా దానికి అండగా నిలబడుతున్నాయి. బీజేపీ ఏ వార్తను ప్రసారం చేసినా.. వాస్తవమేంటో తెలుసుకోవడానికి గ్రోక్‌తో పాటు మిగతా ఏఐ టూల్స్ చాట్‌జీపీటీ, డీప్‌సీక్, జెమినీలనూ నెటిజన్లు ఆశ్రయిస్తున్నారు. మొత్తానికి మానవ మేధస్సు చేయలేని సత్యాసత్యాల అన్వేషణను, చూపలేని విచక్షణా వివేకాన్ని కృత్రిమమేధ చూపిస్తున్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ‘మాటలతో మాయలతో మనుషుల్ని ఏమార్చవచ్చు. అర్ధసత్యాలతో అబద్ధాలను వ్యాప్తిచేయవచ్చు. కానీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని తట్టుకోవడం ఎలా?’ అన్నదే ఇప్పుడు కమలనాథుల ముందు పెద్ద ప్రశ్నగా మారింది.

# రియల్ ఢమాల్!



- హైదరాబాద్‌లో కుప్పకూలిన ‘రియల్’ రంగం..
- దేశంలో ఏ మెట్రో నగరంలోలేని ప్రతికూలత..
- నిరుటితో పోలిస్తే 47% తగ్గిన ఇండ్ల అమ్మకం..
- ప్రాప్ ఈక్విటీ సంస్థ సర్వేలో వెల్లడైన అంశం
- ఏడాదిన్నరగా పడిపోయిన క్రయవిక్రయాలు..
- హైడ్రాతోనే దిగజారిన రియల్ ఎస్టేట్ రంగం
- అసెంబ్లీలో ధ్వజమెత్తిన బీఆర్‌ఎస్, ఎంఐఎం

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 24(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సహా రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఏడాదిన్నర కాలం దాకా దేశంలోనే ఇతర మెట్రో నగరాలను వెనక్కినెట్టి రియల్ రంగంలో దూసుకుపోయిన హైదరాబాద్ మార్కెట్ ఇప్పుడు వేగంగా పడిపోతున్నది. రాష్ట్రం ఆవిర్భావం అనంతరం అభివృద్ధి చెందుతూ రాగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తీవ్ర నష్టాలను చవిచూస్తున్నది. గడిచిన ఏడాదిన్నర కాలంగా నగరంలో జరిగిన క్రయవిక్రయాలు, లీజు లావాదేవీలను పరిగణనలోకి తీసుకుని తాజాగా ప్రాప్‌ఈక్విటీ సంస్థ ఇదే విషయాన్ని కుండబద్దలు కొట్టింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలోని వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకొస్తూ పలు అంశాలతో నివేదికను విడుదల చేసింది.

**లోక్‌సభ ఎన్నికల నుంచి డౌన్‌ఫాల్**

లోక్‌సభ ఎన్నికల తర్వాత రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతూ వచ్చింది. ఇప్పుడు మరింత ఊబిలోకి కూరుకుపోయింది. కొన్ని నెలల కిందట వచ్చిన సర్వేల్లో గరిష్ఠంగా మునుపటితో పోలిస్తే 22% క్రయ, విక్రయాలు తగ్గినట్టుగా తేలింది. కానీ తాజా సర్వేలో ఏకంగా 47% అమ్మకాలు పడిపోవడం గమనార్హం. నిరుడు తొలి త్రైమాసికంలో 20,835 యూనిట్లను విక్రయించగా, ఈ ఏడాదిలో అమ్మకాలు 11,114 యూనిట్లకు పడిపోయినట్టు తేలింది. పడిపోయిన యూనిట్ల విలువ కనీసం రూ. 6 వేల కోట్ల నుంచి రూ. 7వేల కోట్ల మేర ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు ఏటా వచ్చే ఆదాయాన్ని చూస్తే నిరుడి కంటే దాదాపు రూ.6 వేల కోట్లకు పైగా తగ్గడం ఈ సర్వేకు అద్దం పట్టేలా ఉన్నది. ఇతర మెట్రో నగరాల్లో మునుపటితో పోలిస్తే అమ్మకాలు తగ్గినా, హైదరాబాద్‌లో పెరిగిన దాఖలాలు ఉన్నాయి. రియల్ ఢమాల్‌లో హైదరాబాద్ తర్వాత ముంబై, కోల్‌కతా, థానే ఉన్నప్పటికీ హైదరాబాద్ మార్కెట్‌కు సారూప్యత ఉండే బెంగళూరు, చెన్నైలో సానుకూల అమ్మకాలు నమోదైనట్టు నివేదికలో వెల్లడయ్యాయి.

**వివిధ నగరాల్లో అమ్మకాలు**

| నగరం | 2024 | 2025 | తేడా |
|---|---|---|---|
| హైదరాబాద్ | 20835 | 11114 | -47 % |
| ముంబై | 16204 | 10432 | -36 % |
| కోల్‌కతా | 5882 | 4219 | -28 % |
| థానే | 26234 | 19254 | -27 % |
| ఢిల్లీ | 10235 | 11221 | -10 % |
| చెన్నయ్ | 4962 | 4858 | -10 % |
| బెంగళూరు | 16768 | 18508 | 10 % |
| నవీముంబై | 9218 | 8551 | -7 % |

### హైడ్రాతో హైదరాబాదీలు ఇక్కట్లపాలు : ఎమ్మెల్యే వివేకానంద

హైడ్రా పుణ్యమా అని హైదరాబాద్ పరిధిలో రియల్ ఎస్టేట్ కుదేలైందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. హైడ్రాతో నగర ప్రజలతోపాటు బిల్డర్లూ తీవ్ర నష్టాలపాలై ఏకంగా తనువులే చాలిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అసెంబ్లీలో సోమవారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ ఇండస్ట్రీస్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, కమ్యూనికేషన్స్ తదితర శాఖల బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చలో ప్రభుత్వ వైఖరిపై నిప్పులు చెరిగారు. హెచ్ఎండీఏ ఆదాయం ఏటా రూ.120 నుంచి రూ.200 కోట్లు వరకు ఉండేదని, ఈ ఏడాదిలో రూ.50 కోట్ల కంటే తక్కువగా పడిపోయిందని తెలిపారు.

### హైడ్రాతో కుప్పకూలిన రియల్ ఎస్టేట్: అక్బరుద్దీన్

హైడ్రాతో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తంచేశారు. అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ‘హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోయింది.. మార్కెట్ దెబ్బతిన్నది. దీనికి కారణమైన హైడ్రాకు.. మూసీ కూల్చివేతలకు కృతజ్ఞతలు’ అంటూ వ్యంగ్యాస్త్రాలను సంధించారు.